1
నవతెలంగాణ
ఆదిలాబాద్
శనివారం | అక్టోబర్ 05, 2024 | www.navatelangana.com

పీఏసీఎస్ కార్యదర్శికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని ఖోడద్ గ్రామ సబ్ సెంటర్ ముందు జరిగిన రోడ్డు ప్రమాదంలో భీంపూర్ మండలం కరంజి(టి) గ్రామానికి చెందిన పీఏసీఎస్ కార్యదర్శి గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..తాంసి పీఏసీఎస్‌లో కార్యదర్శిగా పనిచేస్తున్న గణేష్ ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం ఆదిలాబాద్ నుండి విధులకు హాజరయ్యేందుకు మోటార్ సైకిల్‌పై వస్తున్నాడు. ఖోడద్ సమీపంలో కుక్క అడ్డు రావడంతో మోటార్ సైకిల్‌పై నుండి కింద పడిపోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. చెవి, ముక్కు నుండి అధిక రక్తస్రావం కావడంతో గ్రామస్తులు వెంటనే 108లో రిమ్స్‌కు తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు.



దళారులకు పంట అమ్మి మోసపోకూడదు

నవతెలంగాణ-బోథ్

రైతులు తమ పంటలు దళారులకు అమ్మి మోసపోకూడదని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మార్కెట్ యార్డ్‌లో సోయా పంట కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ధర క్వింటాలుకు రూ.4895 ప్రకటించిందని, మార్కెట్ యార్డుకు వచ్చే రైతుల కొరకు అధికారులు మంచి నీళ్ల, భోజన వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్, మార్క్‌ఫెడ్ అధికారులు, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, సజన్, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, నాయకులు నారాయణరెడ్డి, రాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.



పండగ పూట..ధరల మంట..!

- పక్షం రోజుల్లోనే పెరిగిన వంట నూనెల ధర
- వెల్లుల్లి కిల్లో రూ.360, ఉల్లిగడ్డలు - రూ.80
- అమాంతం పెరిగిన కూరగాయలు, ఆకుకూరల రేట్లు
- జిల్లాలో ఊసేలేని ధరల నియంత్రణ కమిటీలు
- కొనలేక..తినలేక సతమతమవుతున్న నిరుపేదలు

పండగకు సరుకులు కొనుగోలు చేద్దామని మార్కెట్‌కు వెళ్తున్న నిరుపేదలకు వాటి ధరలు చూసి కంగుతింటున్నారు. నిన్నమొన్నటి వరకు ఒక రకంగా ఉన్న నిత్యావసర సరకుల ధరలు పక్షం రోజుల్లోనే అమాంతం పెరిగిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. నిత్యం కూరల్లో వినియోగించే వంట నూనె, వెల్లుల్లి, ఉల్లిగడ్డల ధరలు అమాంతం పెరిగిపోయాయి. వీటికి తోడు కూరగాయలు, ఆకుకూరల ధరలు సైతం అదే రీతిలో పెరిగిపోవడం సామాన్య, మద్య తరగతి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఆర్థిక స్థితిగతులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సిన వస్తువులు కావడంతో వీలైనంత తగ్గించి తక్కువగా కొనుగోలు చేస్తున్నారు. పండగ సందర్భాలు, పంటలు లేని సందర్భాల్లో నిత్యావసర సరకులు, కూరగాయల ధరలు పెరిగిపోతున్నా వీటిని నియంత్రించేందుకు ఎలాంటి వ్యవస్థలు లేకపోవడం నిరుపేదలకు ఇబ్బందికరంగా మారుతోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నవరాత్రులు ప్రారంభమయ్యాయి. మరికొన్ని రోజుల్లో దసరా పండగ రాబోతోంది. ఈ క్రమంలో ఇంటికి ముందస్తుగానే సరకులు తీసుకెళ్లాలని భావించిన పేదలకు పెరిగిన ధరలు చూసి బెంబేలెత్తుతున్నారు. వివిధ రకాల నిత్యావసర సరకుల ధరలు పదిహేను రోజుల క్రితం ఒక మాదిరిగా ఉండటం.. అంతలోనే వాటి ధరలు ఊహించనంతగా పెరిగిపోవడం వంటి పరిణామాలు పేదలను ఆర్థిక ఇబ్బందుల్లో నెట్టేస్తున్నాయి. బతకాలంటే కచ్చితంగా తినాల్సిన పరిస్థితుల్లో సరకుల కొనుగోలు వారికి తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. రోజువారీ కూలీలు, చిరుద్యోగులు, పేద, మద్య తరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోంది. పదిహేను రోజుల క్రితం కిలో వంట నూనె రూ.110 వరకు ఉండగా.. ప్రస్తుతం కిలోకు ఆయా కంపెనీలను బట్టి రూ.135 నుంచి రూ.140వరకు పెరిగింది. ఇక నిత్యం వినియోగించే వెల్లుల్లి కిలోకు ఏకంగా రూ.360 వరకు పలుకుతోంది. ఉల్లిగడ్డలు కిలోకు రూ.80చొప్పున వెచ్చించాల్సి వస్తోంది. పప్పులు, కుడుకలు(కొబ్బరి) ధరలు సైతం పెరగడం ఇబ్బందులు తెచ్చిపెడుతోంది.



కూరగాయల ధరలు అదే స్థాయిలో..!

నిత్యావసర సరకులకు తోడు కూరగాయలు, ఆకుకూరల ధరలు సైతం పెరగడం పేద కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోంది. మూడు నెలల క్రితం రూ.100కిలో వరకు పలికిన టమాట ధర కొన్ని రోజుల వరకు తగ్గుముఖం పట్టింది. కానీ తాజాగా మళ్లీ కిలో రూ.90వరకు పెరగడం ఆందోళనకరంగా మారింది. వీటితో పాటు వంకాయ కిలో రూ.90, క్యారెట్, కాకరకాయ, దొండకాయ కిలో రూ.80చొప్పున ఉండగా బీరకాయ రూ.90, బెండ రూ.60, చిక్కుడు రూ.100, పచ్చిమిర్చి రూ.70, పువ్వుగోబి రూ.100వరకు పలుకుతోంది. వీటితో పాటు ఆకుకూరల ధరలు సైతం అదే స్థాయిలో ఉన్నాయి. పాలకూర, మెంతికూర కట్టలు రూ.15చొప్పున ఉండగా.. కొత్తిమీర రూ.10చొప్పున ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ పంటల కాలం పూర్తయినప్పటికీ జిల్లాలో కూరగాయల సాగు తక్కువగా ఉండటం.. బయటి ప్రాంతాల నుంచి రావడం వంటి కారణాలతో రవాణా ఛార్జీలు అధికం కావడంతో ఈ పరిస్థితి ఉందని తెలుస్తోంది.

ధరల నియంత్రణ ఏదీ..?

మార్కెట్‌లో నిత్యావసర సరకులు, కూరగాయల ధరలు పెరిగితే పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుంది. వారికి వచ్చే ఆదాయంలో వీటిని కొనుగోలు చేయాలంటే చాలా ఇబ్బందులు పడుతుంటారు. ఈ క్రమంలో ధరలు పెరిగితే కారణాలు తెలుసుకొని ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని ప్రజలకు న్యాయం చేసేందుకు జిల్లా స్థాయిలో ధరల నియంత్రణ కమిటీ ఉండేది. ఉమ్మడి రాష్ట్రం ఉన్న సమయంలో ఈ కమిటీ పలుమార్లు సమావేశమై ధరల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి వాటికి పరిష్కార మార్గాలు అన్వేషించేవారు. కానీ తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఈ కమిటీల ఏర్పాటు ప్రస్తావన లేకుండా పోయింది. చాలా వరకు వస్తువులు ప్రభుత్వ నియంత్రణలో లేకపోవడం..ప్రయివేటు చేతుల్లోకి వెళ్లిపోవడంతో ధరల పెరుగుదలకు కారణమవుతోందని తెలుస్తోంది. ప్రయివేటు వ్యాపారులు గోదాముల్లో సరకులు నిల్వ చేసుకొని కృత్రిమ కొరత సృష్టించడం మూలంగా ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయనే వాదన వినిపిస్తోంది.

ఎదలకు తీవ్ర ఇబ్బందులు : లంక జమున, ఐద్వా జిల్లా కార్యదర్శి



పండగ సమయంలో నిత్యావసర సరుకుల ధరలు పెరగడం పేదలకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. రోజువారీ కూలీలు, చిరుద్యోగులకు ఆర్థికభారంగా మారుతోంది. నిత్యావసర సరుకుల ధరలు పెరిగిన సందర్భాల్లో ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టిసారించి వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. లేదంటే పేదలకు సబ్సిడీల రూపంలో సరుకులు అందజేస్తే బాగుంటుంది.

పంట అమ్మే సమయంలో

రైతులకు ఇబ్బందులు కల్గొద్దు

- అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఎమ్మెల్యే పాయల్ శంకర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పండించిన పంటను అమ్ముకునే సమయంలో రైతులకు ఎలాంటి బాధలు లేకుండా అధికారులు చూడాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శుక్రవారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మార్క్ ఫెడ్ ద్వారా చేపట్టిన సోయా కొనుగోళ్లను అదనపు కలెక్టర్ శ్యామల దేవి, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డితో కలిసి ప్రారంభించారు. ముందుగా కాంటాకు పూజ చేసి తూకం వేశారు. తొలి రైతుకు శాలువతో సత్కరించారు. ప్రభుత్వం అందించే మద్దతు ధర రూ.4వేల892కే రైతులు సోయాను విక్రయించాలని సూచించారు. అనంతరం మార్కెట్‌కు వచ్చిన సోయా పంటను పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు అమ్ముకోవడానికి ఎలాంటి కష్టాలు పడకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. సోయా కొనుగోళ్లను రాష్ట్ర ప్రభుత్వం, పత్తి కొనుగోళ్లను కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సీసీఐ ద్వారా కొనుగోళ్ల చేపడుతున్నామన్నారు. రైతులు మార్కెట్‌కు పంటను తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని, మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తొమ్మిది సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. సోయాతో పాటు జొన్న, శనగ కొనుగోళ్ల చేయాలని సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి అధికారులకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. అధికారులు రైతులకు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులున్న తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి, మార్కెట్ కార్యదర్శి మధుకర్, డీసీఓ మోహన్, అధికారులు శ్రీకాంత్‌రెడ్డి, బీజేపీ నాయకులు ముకుంద్, ఆకుల ప్రవీణ్ పాల్గొన్నారు.

మత్తడి పేల్చివేతకు బీఆర్ఎస్ నాయకులకు సంబంధం లేదు



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ శివారు శనిగకుంట చెరువు మత్తడి పేల్చివేతకు బీఆర్ఎస్ నాయకులకు ఎలాంటి సంబంధం లేదని బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేష్ అన్నారు. చెరువు మత్తడి పేల్చినట్లు ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్‌ను నిరసిస్తూ శుక్రవారం చెన్నూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. మత్తడి పేల్చిన ఘటనలో కాంగ్రెస్ కీలక నాయకులు అసలైన దోషులని ఆరోపించారు. అసలు దోషులను కాకుండా బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపడం అన్యాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై బైటాయించారు. దీంతో బీఆర్ఎస్ నాయకులకు పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో బీఆర్ఎస్ కౌన్సిలర్ దోమకొండ అనిల్‌కుమార్ స్పృహ తప్పిపడిపోయాడు. ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ నవాజ్, మాజీ ఎంపీపీ మంత్రి బాబు, భీమారం మండల అధ్యక్షులు కలెగూర రాజకుమార్, సాదనబోయిన కృష్ణ, రాజారాం, జడల మల్లేష్, ఆరీఫ్, భారతి, కౌన్సిలర్ మహేష్, అనిల్, తుమ్మ రమేష్, జోడు శంకర్, షఫీ, జిలానీ, వీరమల్ల రాము, జైపూర్ మండలానికి చెందిన మల్లేష్, సురేష్, చిన్ని పాల్గొన్నారు.

లాభాల వాటాపై అసత్య ప్రచారాలు



నవతెలంగాణ - కాసిపేట

లాభాల వాటాపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, బ్రాంచ్ ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య పేర్కొన్నారు. శుక్రవారం మందమర్రి ఏరియా కాసిపేట 1వ ఇంక్లైన్‌పై శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ సంస్థలో లేని విధంగా సింగరేణి కార్మికులకు ఏఐటీయూసీ నాయకులు కేఎల్ మహేంద్ర కృషి వల్ల లాభాల వాటా సాధ్యమైందన్నారు. కొన్ని కార్మిక సంఘాలు ఈ సంవత్సరం ఇస్తున్న లాభాల వాటాపై అసత్య ప్రచారం చేస్తున్నాయని, 24 ఏళ్లుగా ఇచ్చిన విధంగానే ఈ సంవత్సరం కూడా లాభాల వాటా ఇవ్వడం జరిగిందన్నారు. కావాలంటే కంపెనీ బ్యాలెన్స్ షీట్ చూస్తే ఈ విషయం అర్థమవుతుందన్నారు. ప్రతి సంవత్సరం కూడా స్థూల లాభం నుండి కాకుండా నికర లాభం నుండి కార్మికులకు వాటా చెల్లించడం జరుగుతుందన్న విషయాన్ని గుర్తు చేశారు. కార్మికులకు పెర్క్స్‌పై ఇన్కమ్ టాక్స్ కంపెనీ చెల్లించే విధంగా పోరాటం చేస్తామని, అవసరమైతే హక్కులను సాధించుకోవడం కోసం సమ్మెకైనా సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, బ్రాంచ్ సహాయ కార్యదర్శి దాసరి తిరుపతిగౌడ్, కోశాధికారి ఎస్.నాగేశ్వరరావు, మీనుగు లక్ష్మీనారాయణ, గొల్ల శ్రీనివాస్, వర్క్ మెన్ ఇన్‌స్పెక్టర్ రంజిత్, బల్లెం శ్రీనివాస్, షిఫ్ట్ ఇన్‌చార్జి సంపత్, కొక్కర సంతోష్, బియ్యాల రాజన్న, ఆడెపు రవీందర్, నాగేశ్వరరావు, తిరుపతి, రవి వర్మ అంజి పాల్గొన్నారు.

కుట్రపూరితంగా శనిగకుంట చెరువు మత్తడి ధ్వంసం



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ శివారు శనిగ కుంట చెరువు మత్తడిని కుట్రపూరితంగా ధ్వంసం చేశారని పోలీసుల విచారణలో తేలినట్లు ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. తన కార్యాలయంలో కేసుకు సంబంధించిన వివరాలు శుక్రవారం వెల్లడించారు. సెప్టెంబర్ 16న రాత్రి శనిగ కుంట చెరువు మత్తడి పేల్చివేశారని పోలీసులకు ఇరిగేషన్ ఏఈ ద్వారా ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. ప్రాథమికంగా అనుమానితులైన పెండ్యాల లక్ష్మినారాయణ, అలియాస్ లక్ష్మణ్, భీం మధుకర్ అలియాస్ మధు, రసమల్ల శ్రీనివాస్‌ను విచారించారు. ప్రధాన నిందితుడైన లక్ష్మినారాయణ నివాసముండే కాలనీ వర్షాకాలంలో చెరువు నీటితో ముంపుకు గురవుతోంది. చెరువును ఆనుకుని 15 ఎకరాల 20 గుంటల భూమి ఉంది. గోదావరిఖని పట్టణానికి చెందిన చెరుకు బుచ్చిరెడ్డి వద్ద మంచాల రాజబాబు, నడిపెల్లి లక్ష్మణ్‌రావు, లక్కం రాజబాబు, రాంలాల్ గిల్డా, బత్తుల సమ్మయ్య, పెద్దింటి శ్రీనివాస్, పోగుల శేఖర్, ఎన్నం బానయ్య, ఇప్ప సంపత్, ఉమేష్ గిల్డా గ్రూపుగా ఏర్పడి కొనుగోలు చేశారు. ఇదే భూమిని తిరిగి చెన్నూర్‌కు చెందిన గొడిసెల బాపురెడ్డికి రూ.7.5కోట్లకు అగ్రిమెంట్ చేసుకుని రూ.4కోట్లు మొదటి విడతగా చెల్లించారు. ఈ క్రమంలో సదరు భూమి నుండి 4ఎకరాల 20 గుంటలు మాత్రమే రిజిస్ట్రేషన్ కాగా మిగతా 11 ఎకరాలు చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నందున రిజిస్ట్రేషన్ చేయించలేకపోయారు. ఈ క్రమంలో వర్షాకాలంలో చెరువు నిండి వరద నీరు సదరు భూమిలోకి వస్తోంది. వరద నీరు రాకుండా చెరువు వైపు మట్టిపోయించడంతో ఇండ్లలోకి వరద నీరు వచ్చి చేరడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ఇరిగేషన్ డీఈ నోటీసులు జారీ చేసినప్పటికీ మంచాల రాజబాపు, నడిపెల్లి లక్ష్మణ్‌రావుకు నాలా పర్మిషన్ ఇచ్చినట్లు విచారణలో తేలింది. ఈ భూమిని కొనుగోలు చేసిన గొడిసెల బాపురెడ్డి విక్రయదారులపై ఒత్తిడి పెంచి విక్రయించిన భూమిని తిరిగి తీసుకుని తాను చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య నుండి బయటపడడం కోసం మత్తడి పేల్చివేతకు కుట్ర చేశారని ఏసీపీ వివరించారు. అయితే మత్తడి పేల్చివేతతో పెండ్యాల లక్ష్మినారాయణ, భీం మధుకర్, రసమల్ల శ్రీనివాస్, గోగుల దానయ్య, నడిపెల్లి లక్ష్మణ్‌రావు, మంచాల రాజబాబు, పెద్దింటి శ్రీనివాస్, లక్కం రాజబాబు, పోగుల శేఖర్, ఇప్ప సంపత్, ఉమేష్ గిల్డా, బత్తుల సమ్మయ్య, రాంలాల్ గిల్డా, ఎన్నం బానయ్యకు సంబంధం ఉన్నట్లు తెలిపారు. వీరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

29, 30 తేదీల్లో సీపీ(ఐ)ఎం జిల్లా మహాసభలు

- జిల్లా కార్యదర్శి సంకె రవి



నవతెలంగాణ-మంచిర్యాల

అక్టోబర్ 29, 30 తేదీల్లో జరిగే సీపీ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం పార్టీ 3వ జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో నిరంతరం సీపీఐ(ఎం) ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బొగ్గు గనులను వేలం పాటలో పెట్టకుండా నేరుగా సింగరేణి సంస్థకే ఇవ్వాలని, సింగరేణి పరిరక్షణ బస్సు యాత్ర, పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం, పంటలకు గిట్టుబాటు ధర, ప్రాణహిత, కాళేశ్వరం బ్యాక్ వాటర్ ముంపుతో నష్టపోయిన వారిని ఆదుకోవాలని ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. ఉద్యోగ, కార్మిక, స్కీమ్ వర్కర్స్ సమస్యల పరిష్కారం, కనీసవేతనాలు, ఉద్యోగ భద్రత కోసం, ఉపాధి హామీ రక్షణ, కౌలు రైతులకు భరోసా, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, సాగుభూములకు హక్కుపత్రాలు, విద్యా, వైద్యం, చిరువ్యాపారస్థులు, మహిళలు, సామాజిక సమస్యలపై పోరాడిందని తెలిపారు. జిల్లాలోని రైతు, కూలి, మహిళ, ఆదివాసి, యువత, విద్యార్థి, సామాజిక తరగతుల సమస్యలపై పోరాటాలు చేస్తున్న పార్టీ జిల్లా 3వ మహా సభలను మందమర్రి పట్టణంలో 29, 30 తేదీలలో నిర్వహిస్తామని తెలిపారు. మహాసభలకు జిల్లాలోని అన్ని మండలాల నుండి 300మంది ప్రతినిధులు హాజరౌతారని తెలిపారు. భవిష్యత్తులో జరిగే ప్రజా పోరాటాల జయప్రదం కోసం ప్రతి ఒక్కరు ఆర్థిక సహకారాలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాసరి రాజేశ్వరి, గోమాస ప్రకాష్, దుంపల రంజిత్ కుమార్, మోహన్, ఉమారాణి, సమ్మక్క పాల్గొన్నారు.

సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టు సర్వే ప్రక్రియ వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేసే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు సర్వేను సకాలంలో పూర్తి చేయాలన్నారు. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాలలోని ఒక మున్సిపల్ వార్డు, ఒక గ్రామం చొప్పున ఎంపిక చేశామన్నారు. సర్వేను సకాలంలో పూర్తి చేసి 9న వివరాలను పరిశీలించి నిర్ణీత ప్రొఫార్మాలో పొందుపరిచి నివేదిక అందించాలని తెలిపారు. ఒక కుటుంబానికి ఒక కార్డు ఉంటుందని, కుటుంబంలోని ప్రతి సభ్యుడికి ఒక ప్రత్యేక నంబర్ కేటాయించడం జరుగుతుందని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అన్నింటికీ ఒకే కార్డు అనుసంధానమై ఉంటుందని తెలిపారు. సర్వే ప్రక్రియలో భాగంగా ప్రజలకు ఒకేసారి పూర్తి వివరాలు సేకరించాలని, రేషన్ కార్డుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల వారి నుండి వివరాలు సేకరించాలని, కుటుంబంలో వయస్సు రీత్యా పెద్దవారైన మహిళను కుటుంబ పెద్దగా నిర్ణయించి మిగిలిన వారిని ఆ వ్యక్తితో కలిగిన సంబంధంతో సహా వివరాలు నమోదు చేయాలని తెలిపారు. సర్వే బృందాలకు అందించిన జాబితా ప్రకారం పేర్లు, వివరాలు సరి చూసుకోవాలని, మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి పేర్లు నిబంధనల ప్రకారం తొలగించాలని తెలిపారు. నూతనంగా వచ్చిన వారి పేర్లు నమోదు చేయాలని, ఉమ్మడి కుటుంబంలో పెళ్లి అయిన వారు ఉంటే వేరుగా నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వం అందించనున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు వివిధ సంక్షేమ పథకాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే

లోకేశ్వరం: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ, మోడర్న్ దుస్తుల్లో హాజరయ్యారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. జూనియర్లు, సీనియర్లు తేడా లేకుండా అందరూ కలిసి చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాలలో చదువుకొని ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువు సాధించిన బుల్లోల్ల విజయ్ కుమార్, అక్షయ్ కుమార్‌ను అధ్యాపకుల బృందం ఘనంగా సన్మానించారు. అనంతరం బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులు గునుగు, తంగేడు, బంతి పూలతో పాటు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి కళాశాల ప్రాంగణంలో ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డీజే చప్పుళ్ల మధ్య బతుకమ్మ పాటలకు అధ్యాపకులు విద్యార్థులతో కలిసి నృత్యాలు చేశారు. బతుకమ్మలను స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గౌతం, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నవీన్, చిన్నయ్య, విఠల్, ప్రమీల, సాయినాథ్, హరీశ్ పాల్గొన్నారు.



జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : వాజీద్ అలీ

నవతెలంగాణ-బోథ్

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక అధికారి వాజీద్ అలీ అన్నారు. మండలంలోని సాకేర గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో మాట్లాడారు. వర్షాకాలంలో విష జ్వరాల రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో మురికి కాలువలను శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం సూర్యనగ్‌లో అంగన్వాడి సెంటర్‌ను పరిశీలించారు. గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. రికార్డులు పరిశీలించి సరిగ్గా లేవని మండిపడ్డాడు. కార్యక్రమంలో ఎంపీడీవో జీవన్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి జాదవ్ అశోక్, ఎన్ఫోర్స్‌మెంట్ డీటీ జాదవ్ రామారావ్, అంగన్వాడి కార్యకర్తలు సుశీల, ఈశ్వరీ పాల్గొన్నారు.

నేరాలు అదుపుచేసేందుకే కార్డెన్ సెర్చ్

నవతెలంగాణ-ఖానాపూర్

నేరాల అదుపుచేసేందుకే కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వస్తున్నట్టు సీఐ సైదారావు తెలిపారు. శుక్రవారం ఉదయం సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో ఖానాపూర్ పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో సరియైన ధృవపత్రాలు లేని 50 ద్విచక్ర



వాహనాలను, 2 త్రీవీలర్స్, 2 ఫోర్ వీలర్స్ మొత్తం 54 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నెంబర్ ప్లేట్ లేకుండా, పత్రాలు లేని, పెండింగ్‌లో ఉన్నందుకు జరిమానాలు విధించినట్టు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమం ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ సర్కిల్ ఎస్సైలు రాహుల్ గైక్వాడ్, రుక్మావర్ శంకర్ పాల్గొన్నారు.

పాయల శరత్‌కు స్మైల్ సొసైటీ సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎమ్మెల్యే తనయుడు పాయల శరత్‌ను స్మైల్ సొసైటీ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల పాయల ఫౌండేషన్ తరపున పాయల్ శరత్ పాస్ ఇండియా కాంక్లేవ్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు సొసైటీ ఆధ్వర్యంలో పూల బొకేను అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహిత మాట్లాడుతూ ఈ అవార్డుతో మరింత భాధ్యత పెరిగిందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు కేమ శ్రీకాంత్, మహ్మద్ రఫీ, సాయిగౌడ్, రామకృష్ణ, రాహుల్, నజ్జు పాల్గొన్నారు.



న్యాయవాదిపై పోలీసుల తీరు అమానుషం

- బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హైడ్రా బాధితులకు అండగా నిలిచిన న్యాయవాది కలీంపై పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషమని ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్నాల నగేష్ అన్నారు. శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ న్యాయవాదులపై పోలీసుల దాడి పరిపాటిగ మారిందని అన్నారు. వారి కేసులు కోర్టుకే రావాల్సి ఉంటుందని, ఈ విషయాన్ని గమనించాలని హితవు పలికారు. హైడ్రా బాధితుల తరపున అండగా నిలిచిన వ్యక్తి న్యాయవాది అని తెలిసి కూడా పోలీసులు దాడి చేశారన్నారు. దాడులు ఆపకుంటే పోలీసులపై ప్రయివేట్ కంప్లయిట్ ఇస్తామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో న్యాయవాద పరిరక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంతోష్, న్యాయవాదులు రహీం, చందుసింగ్, అమరేందర్‌రెడ్డి, కార్డె రవి, విశ్వనాథ్, సరిత పాల్గొన్నారు.

పొగాకుతో కలిగే అనర్థాలపై అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రతి ఒక్కరూ పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సైకాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. నేషనల్ టొబాకో ఫ్రీ యూత్ 2.0 క్యాంపెయిన్‌లో భాగంగా పట్టణంలోని పుత్లీబౌలి పట్టణ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగతాగడం, గుట్కా, తంబాకూ వాడకం వలన అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. క్యాన్సర్, గుండెపోటు, గొంతు క్యాన్సర్, నోటి క్యాన్సర్, ఎముకల క్యాన్సర్ తదితర తీవ్రమైన అనారోగ్య సమస్యలు వెంటాడుతాయని హెచ్చరించారు. పొగాకు ఉత్పత్తుల వాడకం తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమ సమన్వయకర్తలు వెంకటరమణ, శ్రీనివాస్, సోషల్ వర్కర్ చిరంజీవి, ఆస్పత్రి సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పొందేలా వృత్తి నైపుణ్య శిక్షణ అందించాలి



నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పొందేలా వృత్తి నైపుణ్య శిక్షణలను అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిరుద్యోగ యువతకు శిక్షణపై జిల్లాస్థాయి వృత్తి నైపుణ్య సొసైటీ ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు లబ్ది పొందేలా వసతితో కూడిన శిక్షణలు అందిస్తున్నదని తెలిపారు. ఆసక్తి కలిగిన యువతను గుర్తించి వివిధ కోర్సులకు శిక్షణలు పొందేలా యువతను ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాలోని ఐటీఐ, పాలిటెక్నిక్, ఇతర వృత్తి నైపుణ్య కేంద్రాల ద్వారా ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, సోలార్, ఏసీ టెక్నీషియన్, మార్కెటింగ్, బ్యూటీషియన్ తదితర రంగాల్లో శిక్షణను అందించాలన్నారు. వివిధ అంశాల్లో శిక్షణ అందించి జాబ్ మేళాలు నిర్వహించి స్వయం ఉపాధి పొందేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ వృత్తి నైపుణ్య కేంద్రాల ద్వారా శిక్షణను తీసుకున్నవారికి ప్రభుత్వ, ప్రయివేట్ రంగాలలో మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, సీపీఓ జీవరత్నం, డీఆర్డీఓ విజయలక్ష్మి, ఇంటర్మీడియేట్ విద్యాధికారి పరుశురాం, డీటీడీఓ అంబాజీ, ఉపాధి కల్పనా అధికారి శంకర్, మెప్మా పీడీ సుభాష్, వృత్తి నైపుణ్య సొసైటీ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని పద్మావతినగర్‌కు చెందిన గౌరీకార్ నీరజ్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల రెండో తేదీన నిర్మల్ డిగ్రీ కాలేజీ మైదానంలో నిర్వహించిన జోనల్ స్థాయి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్-14 స్కూల్ గేమ్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో తమ ప్రతిభ కనబరిచాడు. ఈనెల మహబూబ్‌నగర్‌లోని గద్వాలలో జరగబోయే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు అభినందించారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలలో మంచి ప్రతిభ కనబర్చాలని పలువురు ఆకాంక్షించారు.

త్రిపుల్ ఐటీ ప్రతిష్టకు మచ్చ..!

- త్రిపుల్ ఐటీ వీసీ మౌనం వెనుక మర్మమేంటో?



నవతెలంగాణ-ముధోల్

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన శ్రీజ్ఞాన సరస్వతి బాసర పుణ్యక్షేత్రంలో విద్యార్థులకు సాంకేతిక విద్యనందించాలనే ఉద్యేశంతో ఏర్పాటు చేసిన త్రిపుల్ ఐటీ నిత్యం ఏదో ఒక ఆరోపణలతో వార్తల్లో నిలవడంతో త్రిపుల్ ఐటీ ప్రతిష్టకు మచ్చగా మారిందని విద్యావంతులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మచ్చను తుడిచాల్సిన త్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ పట్టించుకోకపోవడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నిన్న త్రిపుల్ ఐటీ వీసీ వెంకటరమణపై తీవ్రమైన ఆరోపణలతో ఓయూ జేఏసీ పేరిట కరపత్రం సామాజిక మాధ్యమాల్లో ముమ్మురంగా ప్రచారం జరిగింది. త్రిపుల్ ఐటీలో అవినీతి, అక్రమాలే కాకుండా వీసీపై వ్యక్తిగత ఆరోపణలు కూడా ఆ కరపత్రంలో పేర్కొన్నారు. అయితే ఈ కరపత్రం ఆయా సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉంది. అయితే ఈ కరపత్రంలో పేర్కొన్న ఆరోపణలపై సమాధానం చెప్పాల్సిన బాధ్యతను ఇన్‌చార్జి వీసీ విస్మరించడంపై పలు అనుమానాలకు తావిస్తుందని పలువురు అంటున్నారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకుడైన, ప్రభుత్వాధికారైన తనపై, శాఖపై గాని ఆరోపణలు, విమర్శలు వచ్చినప్పుడు ప్రజలకు జవాబు చెప్పాల్సిన అవసరం వారిపై ఉంటుందని పలువురు గుర్తు చేస్తున్నారు. వీసీ తనపై వచ్చిన ఆరోపణలపై సమాధానం ఇవ్వక, మరింత గందరగోళానికి త్రిపుల్ ఐటీ ప్రతిష్ట నెట్టుతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏకంగా వీసీపై ఆరోపణలు రావడం మరింత చర్చనీయాంశంగా మారింది. వీసీపై ఆరోపణలపై నిజనిజాలు నిగ్గు తెలేవరకు సందిగ్ధత వీడే అవకాశాలు కనిపించడం లేదు. ఇప్పటికైనా వీసి సమాధానం చెప్పుతారో లేదో వేచి చూడాలి మరి.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యం

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిరక్షరాస్యులైన వయోజనులందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం న్యూఇండియా లిటరసీ కార్యక్రమాన్ని రూపొందించిందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన డిప్యూటీ డైరెక్టర్ వయోజన విద్యా శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యూఇండియా లిటరసీ సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 15 ఏండ్లపై బడిన నిరక్షరాస్యులను గుర్తించి, ఐదు దశల్లో వారికి శిక్షణనిచ్చి, అక్షరాస్యులుగా తీర్చిదిద్ది ఉపాధి పొందేలా చేయడమే ముఖ్య ఉద్యేశమని అన్నారు. జిల్లాలో 18051 మంది లక్ష్యం కాగా, ఇందులో పురుషులు 7,220, స్త్రీలు 10,831 మంది ఉన్నారని, వాలంటరీ లర్నర్స్ డిటైల్స్ 10 రోజుల్లో ఐడెంటిఫై చేసి, ఐడెంటిఫై అయిన వారికి ఒక రోజు శిక్షణ ఇవ్వాలని అన్నారు. భోధనాభ్యాస సామగ్రిని సిద్ధం చేయడం జరుగుతున్నదని, స్వయం సహాయక సంఘాలు, ఐకేపీ మహిళలు, ఐసీడీఎస్ లబ్దిదారులు, మున్సిపాలిటీలో, ఉపాధి హామీ కూలీలకు ఇందులో ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం పూర్తిగా స్వచ్ఛందంగా స్థానిక వాలంటీర్ల ద్వార అమలు కానున్నదని, గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఇద్దరు ఉపాధ్యాయుల సహకారంతో వాలంటీర్ల ద్వారా వయోజనులకు సాయంత్రం వేళలో అక్షరాస్యతను అందించనున్నారని తెలిపారు. ఇంటర్మీడియేట్ ద్వారా విద్యార్థులను వాలంటీర్లుగా పనిచేయడానికి, డీఆర్డీఓ ద్వారా ఎస్‌హెచ్‌జి సభ్యులు అక్షరాస్యత లేని మహిళలు జీపీ స్థాయిలో ఐడెంటిఫై, డీడబ్ల్యూఓ ద్వారా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను గుర్తించడం, వైద్యశాఖ ద్వారా ఆశ వర్కర్లందరిని వాలంటీర్లుగా చేర్చడం, మెప్మా మున్సిపల్ ద్వారా పట్టణ ప్రగతి సర్వేలో గుర్తించిన వివరాలు, పంచాయతీ ద్వారా లెర్నింగ్ కేంద్రాలలో నమోదు చేయడానికి పల్లె ప్రగతి సర్వేలో గుర్తించిన వివరాలు వారం పది రోజుల్లో ఐడెంటిఫై చేసి నివేదిక సమర్పించాలని అన్నారు. సమావేశంలో డీఆర్డీఓ సాయన్న, మెప్మా పీడీ మమత, జిల్లా వైద్యాధికారి కృష్ణ, సుధాకర్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, సంబంధిత అధికారులు ఉన్నారు.

త్రిపుల్ ఐటీని సందర్శించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్

- సమస్యలను చెప్పుకున్న విద్యార్థులు



నవతెలంగాణ-ముధోల్

బాసర త్రిపుల్ ఐటీని ఎస్సి, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య సందర్శించారు. శుక్రవారం ఉదయం త్రిపుల్ ఐటీని తనిఖీ చేశారు. విద్యార్థులు, త్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ, అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, తహసీల్దార్‌తో పాటు, విద్యార్థులు, త్రిపుల్ ఐటీ పరిపాలన సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు విద్యార్థులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. బాసర త్రిపుల్ ఐటీలో వసతుల లేమి, ఫ్యాకల్టీ కొరత, కేర్ టేకర్ల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు విన్నవించారు. త్రిపుల్ ఐటీలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలను విద్యార్థులు కమిషన్ దృష్టికి తెచ్చారు. సరిపడా ఫ్యాకల్టీ లేకపోవడంతో ఉన్నత విద్యలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, విద్యార్థులు తెలిపారు. ప్రభుత్వం ఫ్యాకల్టీ నియామకాలపై కసరత్తు చేస్తుందని, కమిషన్‌కు ఇన్‌ఛార్జ్ వీసీ వెంకటరమణ తెలిపారు. వీలైనంత త్వరగా ఫ్యాకల్టీ సమస్య తీర్చాలని కమిషన్ సూచించింది. త్రిపుల్ ఐటీ ప్రతిష్ట దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని వీసీకి ఆదేశించారు. చీఫ్ వార్డెన్ శ్రీదర్‌పై పలు ఆరోపణలు కమిషన్ దృష్టికి వచ్చినట్టు సమాచారం. కమిషన్ చైర్మెన్, సభ్యులు, విద్యార్థులతో కలిసి ఉదయం అల్పాహారం తిన్నారు. విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని వారు బరోసా ఇచ్చారు. బాసర పర్యటన ముగించుకుని ఎస్సీ, ఎస్టీ కమిషన్ బృందం నిజామాబాద్ బయలు దేరి వెళ్లింది.

డిజిటల్ కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

డిజిటల్ కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ డిజిటల్ కార్డుల జారీ కోసం పైలెట్ ప్రాజెక్టు కింద నిర్మల్ పట్టణం 42వ వార్డు (చింతకుంట వాడ)లో శుక్రవారం కొనసాగుతున్న ఇంటింటిసర్వేను ఆమె పరిశీలించారు. ముందుగా ఇంటింటి సర్వేను ఎన్ని బృందాలతో చేపడుతున్నారని, సర్వే నమోదులో ఏమైనా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయా అని సర్వే బృంద సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబాల ఆధారంగా సర్వే జరుగుతోందని, కొత్త కుటుంబాల వివరాలను ఆధార్ కార్డు ద్వారా నమోదు చేస్తున్నట్టు సర్వే బృందం కలెక్టర్‌కు వివరించారు. కుటుంబంలో పెద్ద వయసు కలిగిన మహిళా ఉంటే ఆమె పేరునే ప్రామాణికంగా తీసుకోవాలని, ఎలాంటి తప్పులు లేకుండా సర్వే చేయాలని బృందాన్ని ఆదేశించారు. పైలెట్ కింద ఎంపికైన గ్రామలు, వార్డులో ప్రతి కుటుంబాన్ని సర్వే చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీఓ రత్నకళ్యాణి, మున్సిపల్ కమిషనర్ రాజు, మెప్మా పీడీ సుభాష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పద్యకవి వెంకట్‌కు ప్రశంసా పత్రం



నవతెలంగాణ-నిర్మల్

మహాత్మాగాంధీ జయంతి కవితోత్సవంలో భాగంగా శుక్రవారం పద్యకవి వెంకట్‌కు ప్రశంసా పత్రము అందుకున్నారు. ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా వాట్సప్ వేదిక ద్వారా 2, 3, 4వ తేదీలలో అంతర్జాతీయ స్థాయిలో జరిగిన మహాత్మాగాంధీ కవితోత్సవాలలో ఆంధ్రప్రదేశ్ జానపద అకాడమీ తొలి అధ్యక్షులు, కళారత్న పొట్లూరి హరికృష్ణ, నిర్వాహకులు బి.లహరి, ఉమామహేశ్వరిలు, సంస్కృతభాషా ప్రచార సమితి, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షులు, తెలంగాణ రచయితల వేదిక నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రముఖ వ్యాఖ్యాత, పద్యకవి బి.వెంకట్‌కు వాట్సప్ సమూహములో ఈ ప్రశంసా పత్రమును అందించారు. వెంకట్ తనదైన తేటగీతి పద్యాల్లో గాంధీజీని అందంగా వర్ణించారు.బి.వెంకట్ కవి తమదైన శైలిలో కవితీకరించిన కవితా స్ఫూర్తిని ఆర్ట్ ఫౌండేషన్ అభినందనలు తెలిపారు. కాగా శుక్రవారం తెలంగాణ రచయితల వేదిక నిర్మల్ జిల్లా అధ్యక్షులు నేరెళ్ళ హన్మంతు, కవియాత్ర జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు కారం శంకర్, నిర్మల భారతి సాహిత్య సాంస్కృతిక కళా సామాజిక సేవా క్షేత్రం అధ్యక్షులు తోడిశెట్టి పరమేశ్వర్, ప్రముఖకవులు డా.ఉప్పు కృష్ణంరాజు, పత్తి శివప్రసాద్, అంబటి నారాయణ, పోలీస్ భీమేశ్‌లు వెంకట్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నవతెలంగాణ-లోకేశ్వరం

సీజనల్ వ్యాధుల నివారణకు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీఓ సోలమన్‌రాజ్ కోరారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా లోకేశ్వరంతో పాటు మన్మద్ ప్రజలకు అవగాహన కల్పించారు. వార్డుల్లో పర్యటించి పాత కుండలు, టైర్లలో నిల్వ ఉన్న నీటిని సిబ్బందితో పారబోయించారు. ఇంటి పరిసరాల్లో మురుగు గుంతలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాధవి, వినయ్‌సాయి పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పద్మశాలి సంక్షేమ సంఘం కార్యవర్గం రద్దు

- త్వరలో జిల్లా బాడీ సమావేశం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పద్మశాలి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలి పదవీ మూడు సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో తమకు ఇన్నాండ్లు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు మంచికట్ల ఆశమ్మ తెలిపారు. ప్రస్తుత కార్యవర్గం రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దాదాపు మూడేండ్ల పాటు అనేక ఒడిదొడుకులు ఎదుర్కొని తమ సంఘం సంక్షేమానికి కృషి చేశానన్నారు. ఈ ప్రయాణంలో తనకు సంఘం సభ్యులు, కులబాంధవులు ఎంతగానో సహాయ సహకారమందించి అండగా నిలిచారని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ కులస్తులకు తోడుగా ఉంటానని, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని తెలిపారు. త్వరలోనే జిల్లా బాడీ సమావేశం ఏర్పాటు చేసి కన్వీనర్‌ను ఎన్నుకుంటామన్నారు. రాష్ట్ర కమిటీ ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికలు జరుపుతామని స్పష్టం చేశారు.

మా ఇంటి వంట..మన అంగన్‌వాడీ ఇంట

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంతో పాటు, మన్మద్ గ్రామంలో మా ఇంటి వంట మన అంగన్‌వాడీ ఇంట కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో పిల్లలకు పోషకాహారం పులిహోర, అరటిపండ్లు, పల్లిపట్టి, గుడ్డు అందించారు. ఈ కార్యక్రమం మండలంలో ప్రతి శుక్రవారం నిర్వహించడం జరుగుతుందనీ ఎపీఎం ఆర్ల మల్లేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సోలమన్‌రాజ్, సీసీలు మహేందర్, సుకుమార్, వీఓఏలు పంచాయతీ సెక్రటరీ మాధవి, వినయ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



గుంతల మయంగా రెంకోని వాగు అప్రోచ్ రోడ్డు

- పొంచి ఉన్న ప్రమాదం



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

మండలంలోని దిలావర్‌పూర్ సమీపంలో రెంకోని వాగు బ్రిడ్జి పనుల నేపథ్యంలో వేసిన అప్రోచ్ రోడ్డు గుంతలుగా మారింది. ఇటీవల కురిసిన వర్షానికి గతంలో వేసిన అప్రోచ్ రోడ్డు కొట్టుకు పోయింది. దీంతో బెల్లాల్ వెళ్లే దారిలో రాక పోకలు పూర్తిగా నిలిచి పోయాయి. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో తిరిగి ఆ రోడ్డుపై ఆర్ అండ్ బి అధికారులు సిమెంట్ పైపులు, మొరం పోసి రాకపోకలు పునరుద్ధరించారు. పోసిన మొరం కుంగిపోయి రోడ్డు ఎత్తుపల్లంగా మారింది. వాహనాలు నడిపేటప్పుడు ఏమాత్రం పొరపాటు జరిగినా అదుపు తప్పి వాగులో పడిపోయే ప్రమాదం కనిపిస్తోంది. ఈ రూట్‌లో బెల్లాల్ వైపు ఉన్న దిలావర్‌పూర్, గోసంపల్లే, బావాపూర్, కొత్తపేట్, లింగాపూర్ ఎలగడప, తదితర గ్రామాల నుంచి రాకపోకలు సాగుతాయి. నిత్యం ఉదయం, సాయంత్రం ఆటోలు, వ్యానుల్లో బడి పిల్లలు వస్తూపోతుంటారు. సదరు అప్రోచ్ రోడ్డు ప్రమాదంగా మారడంతో భయానికి లోనవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ప్రమాదాలు జరగకముందే రోడ్డుకు మరమ్మతు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న డిజిటల్ కార్డుల సర్వే

నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని కొత్తపేట గ్రామపంచాయతీలో శుక్రవారం డిజిటల్ కార్డుల సర్వేలో భాగంగా వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గోవింద్ డిజిటల్ సర్వేను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబంలో మహిళ పేరును యజమానిగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ సర్వేలో ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్, ఏఎన్ఎం, ఆశ వర్కర్స్, ప్రతి ఇంటికి తిరుగుతూ వివరాలు సేకరించారు.



ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

నవతెలంగాణ-కౌటాల



నవరాత్రి ఉత్సవాలు శాంతి యుతంగా జరుపుకోవాలి అని ఎస్ఐ ఎన్ మధుకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పలువురికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంతో మండలంలోని అన్ని గ్రామాలలో దసరా నవరాత్రి ఉత్సవాలు శాంతి యుతంగా జరుపుకోవాలి అని అన్నారు. మత ఘర్షణలకు దారి తీయకుండా అందరూ కలిసి మెలిసి పండుగను శాంతి యుతంగా జరుపుకోవాలి అని అన్నారు. నవరాత్రులలో జూదం, కోడి పందాలు పేకట ఆడకూడదని సూచించారు. సైబర్ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక జర్నలిస్టు ఆత్మహత్య

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని ఖిరిడీ గ్రామానికి చెందిన వడ్లూరి సురేష్ గురువారం రాత్రి తొమ్మిది గంటలకు మద్యం మత్తులో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఎస్ఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ దినపత్రికలో జర్నలిస్టుగా పనిచేస్తున్న సురేష్ గత కొన్నేళ్లుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఇదే క్రమంలో తన పిల్లలకు కనీస అవసరాలు కూడా తీర్చలేక పోతున్నానని తీవ్ర మనోవేదనకు గురై మద్యం మత్తులో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు రెఫెర్ చేశారు. మంచిర్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జర్నలిస్టు కుటుంబానికి చేయూత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వాంకిడి మండలానికి చెందిన జర్నలిస్టు సురేష్ మృతి తీరని లోటు అని ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ అన్నారు. శుక్రవారం ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డ సురేష్ పార్థివ దేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. జర్నలిస్టు సురేష్ ఆత్మహత్యకు పాల్పడడం చాలా బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ ద్వారా ఆయన కుటుంబానికి ఆర్థిక సాహాయం అందే విధంగా చూస్తామని తెలిపారు. అంత్యక్రియలకు జర్నలిస్టుల వద్ద సేకరించిన రూ.10, 000 అతని భార్యకి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్‌గౌడ్, టీయూడబ్ల్యూజే నాయకులు తారు, దేవనూరి రమేష్, రాధాకృష్ణ చారి, వారణాసి శ్రీనివాస్, సురేష్ చారి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు రాజ్ కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఖలీల్, సాయి, మోయిన్, సంతోష్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-రెబ్బెన

స్వచ్ఛత పక్వాడ (స్పెషల్ కాంపెయిన్ 4.0) కార్యక్రమంలో భాగంగా జీఎం శ్రీనివాస్ ఏరియా అధికారులతో కలిసి బెల్లంపల్లి ఏరియా గోలేటి సంతలో శుక్రవారం స్వచ్ఛత పనులు చేశారు. ఈ సందర్భంగా జీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర బొగ్గుగనుల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు బెల్లంపల్లి ఏరియాలో స్పెషల్ కాంపెయిన్ 4.0(స్వచ్ఛత) కార్యక్రమాన్ని రెండు విడతల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. మొదటగా సెప్టెంబర్ 30వ తేదీ వరకు సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా చేపట్టాల్సిన పనులు, ప్రదేశాలు గుర్తించామన్నారు, అక్టోబర్ 2వ తేదీ నుండి 31 వరకు గుర్తించిన పనులను అమలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. కార్యాలయాలతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. అలాగే కార్యాలయాల్లో వస్తువులను క్రమపద్ధతిలో ఉంచుకోవాలని అన్నారు. ఏరియాలో పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని అన్నారు. మైన్స్, డిపార్టుమెంట్లను శుభ్రంగా ఉంచుకోవాలని ఈ సారి బెల్లంపల్లి ఏరియాకు స్వచ్ఛతలో మొదటి స్థానం వచ్చేలా ప్రతి ఉద్యోగి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్ తిరుపతి, ఎస్ ఓ టూ జీఎం కె రాజమల్లు, పీఓ ఉమాకాంత్ ఏరియా ఇంజినీర్ భీంరావ్ జాడే, ఏరియా సర్వే అధికారి చంద్రశేకర్, డీజీఎం ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సివిల్ ఎస్ఈ మదీనా బాషా, ఎన్విరాన్మెంట్ అధికారి రమేష్ అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ప్రయివేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రయివేటు ఆస్పత్రులు నిబంధనలు పాటించాలని టీవి జాయింట్ డైరెక్టర్ రాజేశం అన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం అమలులో భాగంగా రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లాలో పర్యటించారు. జిల్లాలోని ప్రయివేట్ ఆస్పత్రులను జిల్లా వైద్యాధికారి తుకారాం బట్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేట్ ఆస్పత్రులు నిర్ణీత నిబంధనలు పాటించాలన్నారు. అగ్ని ప్రమాద నివారణ చర్యలు తీసుకోవడంతో పాటు ఇతర నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టెక్నికల్ ఆఫీసర్ వాసు ఏసీఏఎం ఆఫీసర్ జితేందర్, పీఓ ఎన్సిడి వినోద్ కుమార్, పీఓ టీబీ అజీమ్, డీపీసీ పవన్ కుమార్ పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-రెబ్బెన

మండల కేంద్రంలోని ఫారెస్ట్ నర్సరీలో పనిచేస్తున్న కార్మికులకు 7 నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. వేతనాలు చెల్లించని లేని పక్షంలో డీఎఫ్ఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. శుక్రవారం రెబ్బెన ఎఫ్ఆర్ఓ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ రాజేందర్ గారికి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తమ కుటుంబాన్ని పోషించుకోలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌ని ఎన్నిసార్లు అడిగినా రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని, జిల్లా ఫారెస్ట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని అన్నారు. వేతనాలు చెల్లించని అధికారిపై చర్యలు తీసుకోవాలని, అధికారుల నిర్లక్ష్యంతో పండుగ పూట కార్మికులు పస్తులు ఉండవలసిన పరిస్థితి వచ్చిందని అన్నారు. ఈ నెల ఏడవ తేదీలోపు వేతనాలు చెల్లించకుంటే తరువాత ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డిఎఫ్ఓ కార్యాలయాన్ని పెద్ద ఎత్తున ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైన అధికారులు ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, రోజు కూలి రూ.600 ఇవ్వాలనిడిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ నర్సరీ కార్మికులు దశరథం, బాపు రావు, మారుతి, సంతోష్, కౌసల్య, సంఘమిత్ర, సరితా, స్వరూప, శాంకరమ్మ పాల్గొన్నారు

ఎఫ్‌డీసీ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే



ఎఫ్‌డీసీ సర్వే పరిశీలన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టు సర్వే ప్రక్రియ వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు, దస్నాపూర్‌లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సంబంధించిన కుటుంబ సభ్యుల వివరాలు ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని, ఇంటి యజమానురాలిగా మహిళ పేరు నమోదు చేసి తర్వాత కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయాలని తెలిపారు. అనంతరం కుటుంబం గ్రూప్ ఫోటోను తీసుకోవాలని, మరణించిన వారు, శాశ్వతంగా వెళ్లిపోయిన వారి పేర్లను తొలగించి, జాబితాలో లేని వారి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఉమ్మడి కుటుంబం వివాహం జరిగి వేరువేరుగా నివాసం ఉంటే వారి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, సర్వే బందం సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలి

ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోళ్లకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం అదనపు కలెక్టర్ దాసరి వేణు, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావులతో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో తూకం యంత్రాలు, టార్పాలిన్ కవర్లు, గన్ని సంచులు, హక్ రిమూవర్, డిజిటల్ మైక్రో మీటర్లు అందుబాటులో ఉంచాలని, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, నీడ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. జిల్లాలో 34 కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అవసరం మేరకు అదనపు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లు, రికార్డులు, ఆస్పత్రి పరిసరాలు, భోజనశాల, వంటగది పరిశీలించి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల వివరాలు తెలుసుకున్నారు.

కుమురంభీం వర్ధంతి పోస్టర్ల విడుదల

జిల్లాలోని జోడెన్ ఘాట్‌లో ఈనెల 17న నిర్వహించే కుమురంభీం వర్ధంతి పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసి, గిరిజనుల సంక్షేమం కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఆదివాసీల ఆరాధ్య దైవం కుమురంభీం వర్ధంతి ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి, గిరిజన సంఘాల నాయకులు, వర్ధంతి వేడుకల ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోళ్లపై సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్



కుమురం భీం వర్ధంతి పోస్టర్లు ఆవిష్కరణ

బకాయి వేతనాలు చెల్లించండి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ మేజర్ గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికుల వేతనాలు చెల్లించకుండా పంచాయతీరాజ్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని వేతనాలను చెల్లించాలని అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకోవడంలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయం ముందు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎంఆర్ పారిశుధ్య కార్మికుల సంబంధించిన పది నెలల వేతనం, మల్టీపర్పస్ కార్మికుల నాలుగు నెలల వేతనాలు చెల్లించకుండా మాతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని వేతనాల గురించి అడిగితే పని చేస్తే చేయండి లేకపోతే లేదని బెదిరింపులకు గురి చేస్తున్నారని. బకాయి ఉన్న వేతనాలు చెల్లించకపోవడంతో వడ్డీ వ్యాపారస్తుల నుండి అప్పులు తీసుకొని కుటుంబాలను పోషించుకుంటున్నామని. అధికారులు మా వేతనాలు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని వేతనాల విషయంపై పలుమార్లు అడిగితే రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని, కొన్ని రోజుల క్రితం మా వేతనాలకు సంబంధించిన చెక్కును తప్పుగా కొట్టడంతో వేతనాలు నిలిచిపోయాయని అధికారులు తప్పులు చేస్తే మాకు శిక్ష ఏంటని చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నప్పటికీ అధికారులు మా వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహించడం ఎంతవరకు సమంజసమని అధికారులను ప్రశ్నించారు. గత నెల జిల్లా పంచాయతీ అధికారి ఎంపీడీఓ కార్యాలయానికి పర్యవేక్షించడానికి వచ్చిన సమయంలో ఆయనకు వేతనాల గురించి తెలియజేశామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా సమస్యను పరిష్కరించాలని లేనియెడల వేతనాలు వచ్చేంతవరకు విధులకు హాజరుకామని గ్రామపంచాయతీ కార్మికులు అన్నారు.

కోడిపందాల స్థావరాలపై మెరుపు దాడి

- 34 ద్విచక్ర వాహనాలు, సెల్ ఫోన్లు స్వాధీనం
- పలువురుపై కేసు నమోదు
- మండలంలో పెరుగుతున్న జూదం
- కట్టడి చేయాలని కోరుతున్న మండల ప్రజలు



నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని ప్రాణహిత పరిసర ప్రాంతాలైన గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా కోడిపందాల ఆట జరుగుతుందని లక్షల్లో బెట్టింగ్లు కాస్తున్నారని పక్కా సమాచారం మేరకు కౌటాల సీఐ ముత్యం రమేష్ గురువారం రాత్రి మెరుపు దాడి చేయడంతో భారీగా ద్విచక్ర వాహనాలు సెల్ ఫోన్లు పట్టుబడ్డాయి. చాలామంది యువత పోలీసులు వచ్చారని సమాచారంతో పారిపోయినట్లు సమాచారం. గత కొన్ని రోజుల నుండి మండలంలోని మొగ వెళ్లి గ్రామ సమీపంలోని ప్రాణహిత పరివాహక ప్రాంతంలోని అడవి ప్రాంతంలో కోడి పందాలు ఆట జోరుగా సాగుతుందని లక్షల్లో బెట్టింగ్ నడుస్తున్నాయని ఆ ప్రాంతవాసులు తెలిపారు. ఈ వార్త చివరకు పోలీసులకు చేరడంతో జూదగాలను పట్టుకోవడానికి కౌటాల సీఐ ముత్యం రమేష్ పథకం ప్రకారం బొలెరో వాహనంలో ప్రాంతానికి చేరుకున్నారు దీని గుర్తించని జూదగాలు అక్కడే ఉండిపోవడంతో వెంటనే రమేష్ రంగ ప్రవేశం చేసి జూదగాలను పట్టుకొని వాహనాలను స్వాధీనపరుచుకున్నారు. భారీ ఎత్తున వాహనాలు పట్టుబడంతో మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోడిపందాలను అరికట్టేందుకు పోలీసులు తీసుకున్న చర్యలపై సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో సైతం అందులో కూడా గ్రామ సమీపంలో కోడిపందాలు ఆడుతున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. పేకాట రాయలపై కూడా దాడులు చేసి పట్టుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

ఎంతటి వారినైనా వదిలిపెట్టం

పేకాట, కోడిపందాలు జూదం ఆడే వారిపై ఉక్కు పాదం వేస్తామని సీఐ రమేష్ తెలిపారు. ఎంతటి వారినైనా కూడా వదిలి పెట్టమని పేర్కొన్నారు. గట్టి నిగాను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు స్థావరాలుపై దాడులు చేస్తామన్నారు. కోడిపందాలు స్థావరంపై పక్కా దాడి చేశామని వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఈవీఎంల రక్షణకు పటిష్టమైన ఏర్పాట్లు

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రక్షణకు ప్రతిష్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదామును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం గత పార్లమెంటు ఎన్నికలలో సాంకేతిక సమస్యలతో ఆగిపోయిన 1 బ్యాలెట్ యూనిట్, 10 వీవీ ప్యాట్‌ల మరమ్మతులకు ఈసీఎల్ హైదరాబాద్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవీఎం గోదాములో పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు చేపట్టి బందోబస్తు కల్పించామని అన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిరంతరం నిఘా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి మధుకర్, ఎన్నికల న్యాయం తహసీల్దార్‌లు శ్యామలాల్, ఊర్మిళ, రామ్ లాల్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్‌తో పాటు క్రీడా దుస్తులు అందజేత



నవతెలంగాణ-కౌటాల

మండలంలోని వీర్దండి గ్రామంలో శివ రామ సాయి యూత్ అధ్యక్షుడు గుర్లె శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు శుక్రవారం వాలీ బాల్ కిట్‌తో పాటు క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంతోపాటు వ్యక్తుల మధ్య పోటీతత్వం పెంచుతాయని క్రీడల వల్ల యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని తెలిపారు. యువతను నియోజక వర్గానికి ఆదర్శంగా తీర్చిదిద్దే విధంగా గత 13 సంవత్సరాల నుండి శ్రీ శివ రామ సాయి యూత్ వెల్ఫేర్ సొసైటి అధ్వర్యంలో క్రీడపోటీలు నిర్వహిస్తూ క్రీడాకారులకు క్రీడ సామాగ్రిని అందిస్తూ ప్రోత్సహిస్తున్నామని అన్నారు. తమని ప్రోత్సహిస్తూ తమకు వాలీబాల్ కిట్‌తో పాటు క్రీడా దుస్తులు అందించిన యూత్ సభ్యులను విర్దండి గ్రామ క్రీడాకారులు కృతజ్ఞతలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విర్ధండి మాజీ సర్పంచ్ మడవి రేణుకా యువనాయకులు జాడే వంశి పెందుర్ రాజు నాగరాజ్ యూత్ సభ్యులు బన్లే విజయ్ విలాస్ సంతోష్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీలకు సన్మానం



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని చెడ్వాయి అంగన్‌వాడీ టీచర్ గౌరుబాయ్, లోడపెల్లి అంగన్‌వాడీ ఆయా సలమ్మా, బొంబాయిగూడ అంగన్‌వాడీ ఆయా సుశీల ఉద్యోగ పదవి విరమణ సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, సడీపీఓ విజయలక్ష్మి వారిని సన్మానించారు. అనంతరం కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీ సిబ్బంది బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, పద్మ, డిప్యూటీ తహసీల్దార్ సరిత, పాల్గొన్నారు.

నేటితో ధ్రువపత్రాల పరిశీలన పూర్తి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

డీఎస్సీ నియమాకాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాల పరిశీలన నేటి సాయంత్రంతో పూర్తి చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 4వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గడువులోగా 1:3 నిష్పత్తిలో మెసేజులు వచ్చిన అభ్యర్థుల పరిశీలన జరుగుతుందని తెలిపారు. మిగిలిన అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని తెలిపారు.



ఉమ్మడి జిల్లా చెస్ పోటీలు

నవతెలంగాణ-మందమర్రి



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో లిటిల్ ఫ్లవర్ హై స్కూల్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చెస్ అండర్-19 పోటీలను నిర్వహించారు. శుక్రవారం ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరి బి బాబురావు ఫిజికల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలల విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులు మేడ్చల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా తరపున పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఎం విశ్వతేజ సీఓఈ బెల్లంపల్లి, బి వాసు, జీజేసీ కాసిపేట, కె అనుదీప్, ఎస్టి మేరీస్ బెల్లంపల్లి, కె అశ్విత్ తేజ టీజీఎంఎస్ మందమర్రి, ఈ అరవింద్, సీఓఈ బెల్లంపల్లి, సిహెచ్ ప్రశాంత్, జీజేఈ కాసిపేటకి చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను డీఐఈఓ అంజయ్య, లిటిల్ ఫ్లవర్స్ స్కూల్ కరెస్పాండంట్ సిద్దయ్య, జిల్లా చెస్ అసోషియేషన్ సెక్రటరి కనకయ్య అభినందించారు.

గృహజ్యోతి అర్హత కార్డులు అందజేత

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో గృహ జ్యోతి పథకం రూ.500 సిలిండర్‌కు సంబంధించిన అర్హత కార్డులను శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు నలిమెల రాజు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందన్నారు. అక్టోబర్ మొదటి వారంలో అందరికీ కొత్త రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. రాబోవు రోజుల్లో అన్ని హామీలను అమలుచేసి అర్హులందరికీ న్యాయం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ స్వప్న, ఎంపీడీఓ కె.సరోజ, ఎంపీఓ. శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంకతి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ జిల్లా నాయకులు నలిమెల సత్తయ్య, బండి రాజలింగు పాల్గొన్నారు.

వన్యప్రాణులకు హాని కలిగిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-తాండూర్

పేట పేరుతో వన్యప్రాణులకు హాని కలిగిస్తే వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఆర్‌ఓ తిరుపతి అన్నారు. అటవీశాఖ అధికారులతో కలిసి తాండూర్ మండలం, మాదారం 3 గ్రామంలో వన్యప్రాణి వారోత్సవాలను నిర్వహించారు. మాదారంలోని ఫారెస్ట్ ఆఫీసు ముందు ఫ్లెక్సీ ఆవిష్కరించి, మాదారంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ అధికారులు మాట్లాడుతూ వేట పేరుతో వన్యప్రాణుల వేటాడి పట్టుపడితే జైలు శిక్ష అనుభవించవలసి వస్తుందని తెలిపారు. సంరక్షణ చట్టాలు కఠినంగా ఉన్నాయని తెలిపారు. అడవిలోకి ఎవరు వేటకు వెళ్లొద్దని వన్యప్రాణులను హింసించొద్దని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో అడవులు ప్రముఖ పాత్ర వహిస్తాయని అడవులను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదన్నారు. అటవీ ప్రాంత పరిసరాల ప్రజలు అడవి జంతువులను విద్యుత్తు తీగలతో వేటాడే ప్రయత్నాలను మానుకోవాలని సూచించారు. అటవీ చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన ఉండాలని తెలిపారు. అటవీ ప్రాంత ఆదివాసులను ఇబ్బందులకు గురి చేయకూడదని అటవీ అధికారులకు సిబ్బందికి సూచించారు. ఆదివాసి ప్రజలతో స్నేహంగా ఉంటూ అటవీ సంపదను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ సువర్ణ, ఎఫ్‌బీఓ భాస్కర్, గోపి కృష్ణ ఎఫ్‌బీఓ, మాజీ ఎంపీటీసీ రాంచందర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, దర్శనాల రాజ్యం, రేబ్బెన్ రాజన్న, చింతపురి రమేష్, కామేర భారత్ పాల్గొన్నారు,

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-వేమనపల్లి

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బెల్లంపల్లి నియోజకవర్గంలో విపక్షాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం మాజీ జడ్పీటీసీ రుద్రభట్ల సంతోష్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ షాబీర్ అలీ ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ ఆకుల లింగాగౌడ్, పాఠశాల కమిటీ చైర్మన్ అంబాల శ్రీనివాస్, సంతోష్, చిరంజీవి, జుమ్మిడ శంకర్, దున్న పవన్, ఎడ్ల రూదేష్, కోండ్ర సత్యం, అల్లూరి బక్కయ్య, దస్నాపూర్ గ్రామానికి చెందిన, కైరి రాజేష్‌గౌడ్, తాల్ల తిరుమలేష్ గౌడ్, వేపురి సంతోష్ గౌడ్, తాల్ల రామగౌడ్, రాజగౌడ్, మహేష్ గౌడ్, సంతోష్ గౌడ్, రాకేశ్ గౌడ్, సాయి గౌడ్, కిష్టయ్య,అంజన్న, శంకర్, శ్రీను, వెంకటేష్, మహేశ్వర్ గౌడ్ లతో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో నీల్వాయి తాజా మాజీ సర్పంచ్ గాలి మధు, మాజీ వైస్ ఎంపీపీ ఒడిల రాజన్న, మాజీ సర్పంచ్ వి. తిరుపతి రెడ్డి, దస్నాపూర్ మాజీ సర్పంచ్ కొమురం రమేష్, చెన్నూరి పురుషోత్తం, నెండుగురి మధుసూదన్, తాళ్ల వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసిన వారు వెరిఫికేషన్ చేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

రేండ్లగూడ గ్రామపంచాయతీ పరిధిలో ఎల్ఆర్ఎస్ అప్లై చేసుకున్న వారు ఎల్ఆర్ఎస్ వెరిఫికేషన్‌కు రావాలని ఆ గ్రామ కార్యదర్శి లకావత్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చేటప్పుడు ల్యాండ్ డాక్యుమెంట్స్, ఎల్ఆర్ఎస్ అప్లికేషన్ ఫామ్, తీసుకొని రావాలని పేర్కొన్నారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసులు



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని గూడెం గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని దండేపల్లి, లక్షెట్టిపేట బ్లూ కోర్ట్ పోలీసు సిబ్బంది కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండి చెందిన నమ్మసని శ్రీకాంత్ అనే ఆటో డ్రైవర్ బెల్లంపల్లిలో తన బంధువుల ఇంటికి వెళ్లి అక్కడ గొడవ కావడంతో ఆత్మహత్య చేసుకుని చనిపోతానని చెప్పి గూడెం గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్య యత్నం చేశాడు. కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి గోదావరిలో దూకి చనిపోతున్నానని చెప్పగా శ్రీకాంత్ కుటుంబ సభ్యులు వెంటనే డైల్ 100కు సమాచారం అందివ్వడంతో అప్రమత్తమైన పోలీస్ సిబ్బంది సకాలంలో స్పందించి సమన్వయంతో ఆత్మహత్య చేసుకోబోతున్న శ్రీకాంత్‌ను కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. విధి నిర్వహణలో భాగంగా సకాలంలో గోదావరి బ్రిడ్జి వద్దకు చేరుకొని వ్యక్తి ప్రాణాలు కాపాడిన బ్లూ కోర్టు సిబ్బంది లక్ష్మయ్య, పెట్టెం శేఖర్, హోంగార్డులు బ్రహ్మం, రత్నాకర్లను లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్, ఎస్ఐలు సతీష్, ఉదయ్ కిరణ్ అభినందించారు.

పల్లెల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

నవతెలంగాణ-జన్నారం

గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆదిలాబాద్, ఎంపీ గోడం నగేష్ అన్నారు. శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఖానాపూర్ నియోజకవర్గ నాయకుడు రాథోడ్ రితీష్, సభ్యత్వ నమోదు కన్వీనర్ ఆకుల శ్రీనివాస్, అధ్యక్షులు మధుసూదన్ రావుతో కలిసి పర్యటించారు. ప్రజలంతా కాంగ్రెస పాలనలో విసిగిపోయారని, ప్రస్తుతం ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని, ఈ నేపథ్యంలోనే సభ్యత్వాలు విరివిగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య

పల్లె నిద్రతో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

- పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్
- దేవాపూర్ పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-కాసిపేట

పల్లెనిద్రతో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు రామగుండం పోలీస్ కమీషనర్ ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం కాసిపేట మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌ను రామగుండం పోలీస్ కమీషనర్ ఎం శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్లను చేరుకున్న సీపీ ముందుగా పోలీస్‌స్టేషన్ల పరిసరాలను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ రిసెప్షన్ సెంటర్‌లోని సీసీసీ పిటిషన్‌లను వాటి రికార్డ్‌లను తనిఖీ చేసి పోలీస్‌స్టేషన్ కు వచ్చే బాధితుల ఫిర్యాదుల విషయంలో వెంటనే స్పందించి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. పోలీస్‌స్టేషన్ రికార్డ్స్, పోలీస్ అధికారులు సిబ్బంది వివరాలు, వారు చేస్తున్న విధులు, పని తీరు, వారికి ఏదైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధి బౌగోలిక పరిస్థితులు, ఇక్కడ ఉండే ప్రజల, ఫ్యాక్టరీల గురించి, కాలనీ, గ్రామాల్లో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయని, ట్రాఫిక్ సమస్యలు, లా అండ్ ఆర్డర్ సమస్యలు, క్రైం నియంత్రణ చర్యలు, సీసీ కెమెరాల ఏర్పాటు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో ఒక ఇన్ఫర్మేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, ప్రజలు, యువతతో మంచి సత్సంబంధాలు కలిగి ఉండాలని, ఏదైనా సమాచారం వచ్చిన వెంటనే స్పందించి సంఘటన స్థలానికి వెళ్ళాలని సూచించారు. యువత భవిష్యత్తు కోసం ఉద్యోగాల కోసం ప్రయత్నం చేసేవారికి పోలీస్ తరుపున ఎప్పుడు అండగా ఉండాలన్నారు. బ్లూ కోల్ట్స్ సిబ్బంది డయాల్ 100 కాల్స్‌కి వెంటనే స్పందించి వారు సంఘటన స్థలంకి త్వరగా చేరుకోవాలని సూచించారు. వారితో అక్కడ పరిస్థితి కంట్రోల్ కానప్పుడు వెంటనే ఎస్ఐ, సిబ్బందికి సమాచారం అందించి వెంటనే పిలిపించుకోవాలన్నారు. బ్లూ క్లోట్స్, పెట్రో కార్ సిబ్బంది విసబుల్ పోలిసింగ్ నిర్వహించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు, ఫిర్యాదులు తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని అన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీస్ అధికారులతో కలిసి సీపీ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, ఎస్ఐ ఆంజనేయులు ఉన్నారు.

డిజిటల్ కార్డుల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-దండేపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండలంలోని అల్లిపూర్ పంచాయతీ పరిధిలోని కశపెల్లి గ్రామంలో చేపట్టిన డిజిటల్ కార్డు సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మళ్ళీ ఎప్పుడు గ్రామం పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. సర్వే సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్ళి వివరాలను నమోదు చేయాలని సూచించారు. నమోదు చేసిన వివరాలను స్వయంగా పరిశీలించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నోబుల్ టీజీ సమస్య గురించి స్థానిక రైతులు ఆయన దృష్టికి తీసుకురాగా విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అంతకుముందు దండేపల్లి కేజీబీవీ పాఠశాలలో కొనసాగుతున్న భావన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలలో పాడైపోయిన వాటర్ ప్లాంట్ కు మరమ్మతులు చేయించాలని అవసరమైతే కలెక్టర్ నిధుల నుంచి చెల్లిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. డెంగ్యూ, వైరల్ ఫీవర్ కేసు నమోదు ఆస్పత్రిలో మందులు లభ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ జేఆర్ ప్రసాద్, ఆయన శాఖల అధికారులు, స్థానిక నాయకులు ఉన్నారు.

వేధింపులకు గురి చేస్తున్న అధికారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కె-5 గని మేనేజర్ అబ్దుల్ ఖాదీర్ వేధింపులకు గురి చేస్తున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గని కార్మికుడు దేవి శ్రీనాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనారోగ్య సమస్యల వలన భూగర్భ గణిలోకి దిగి పని చేయలేకపోతున్నానని, సర్ఫేస్‌లో పని కల్పించాలని అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోవడం లేదన్నారు. ఇదే విషయాన్ని గని మేనేజర్ దృష్టికి తీసుకెళ్లగా అతడు కులం పేరుతో దూషించాడని అన్నారు. అతనిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టామని సింగరేణి అధికారులు కూడా చర్యలు తీసుకోవాలన్నారు.

అవన్నీ అసత్యపు ఆరోపణలు

గని కార్మికుడు దేవి శ్రీనాథ్ చేసేవన్నీ అసత్యపు ఆరోపణలని గని మేనేజర్ ఖాదీర్ అన్నారు. శ్రీనాథ్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నాడని, లైట్ జాబ్ కావాలంటూ పలుమార్లు వినతి పత్రాలు అందజేశాడని తెలిపారు. అతను 2009 నుండి 2024 వరకు కేవలం 3 సార్లు మాత్రమే 190 మాస్టర్లు పూర్తి చేసాడని, విధులు సరిగా నిర్వర్తించకపోవడం వల్ల అనేకసార్లు కౌన్సిలింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. అబ్దుల్ ఖాదీర్ గని మేనేజర్‌గా రాకముందు నుంచి అతడు డ్యూటీలు సరిగా చేసేవాడు కాదని, 2019లో 2020లో 0 మాస్టర్లు చేశాడని, తన వేధింపుల వలె డ్యూటీకి రావడం లేదని చెప్పడం విస్మయానికి గురి చేస్తుందని తెలిపారు. ఇదిలా ఉండగా లైట్ జాబ్ కోసం పలు మార్లు దరఖాస్తు చేసుకోగా ఏరియా జనరల్ మేనేజర్‌కు అనుమతుల కోసం పంపగా మరలా కౌన్సిలింగ్ నిర్వహించి సర్ఫేస్‌లో పనులు అప్పగించినట్లు తెలిపారు. అయినా కూడా అతను ఫ్యాన్ హౌస్ దగ్గర పర్మినెంట్‌గా జాబు ఇప్పించాలని డిమాండ్ చేయగా, దానికి ట్రైనింగ్ సర్టిఫికెట్ లేకుండా ఇవ్వడం కుదరదని చెప్పడంతో అతనిపై కక్ష కట్టి, ఎస్సీ, ఎస్టీ ఆరోపణలు చేస్తున్నాడని తెలిపారు. శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయడం బాధాకరమని, నిజ నిర్ధారణ విచారణ అనంతరం తెలుస్తుందని అన్నారు.

వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను శుక్రవారం స్థానిక ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అప్పని లక్ష్మణ్ మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంలోకి నూతనంగా అడుగిడిన విద్యార్థులకు స్వాగతం పలికారు. సత్ప్రవర్తనతో మన కళాశాల నిబంధనలను పాటిస్తూ, క్రమశిక్షణతో, ఉన్నతమయిన విద్యాబుద్దులు నేర్చుకోని, జీవితంలో ఉన్నత శిఖరాలధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పుప్పిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వెన్నంపెల్లి, మహేందర్, గడదాసు సాగర్, గడిగొప్పుల శ్రీనివాస్, గుజ్జేటి నరేశ్, చంద వెంకటరమణ, చిలుకూరి వంశీ పాల్గొన్నారు.

వైష్ణవి మహిళ కళాశాలలో

పట్టణంలోని వైష్ణవి మహిళా కళాశాల ఫ్రెషర్స్ డే ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకను పురస్కరించుకుని స్థానిక కెఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆకుల కిరణ్ మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంలోకి నూతనంగా అడుగిడిన విద్యార్థులకు స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, నాటికలు, ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ చక్రపాణి, చింత అభినయ్, జాడి సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ తోట తిరుపతి పాల్గొన్నారు.



29, 30న సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-జన్నారం

ఈ నెల 29, 30 తేదీల్లో మందమర్రి పట్టణ కేంద్రంలో నిర్వహించే సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి కనికారం అశోక్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేసేదే సీపీఐ(ఎం) అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను. ఈ సభలో ఎండ కట్టడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం చెందిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తామన్నారు. మందమర్రిలో నిర్వహించే ఆ సభను పార్టీ శ్రేయోభిలాషులు అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కూకటికారి బుచ్చయ్య. కొండగొర్ల లింగన్న, గుడ్ల రాజన్న, దాసంల రాజన్న, రాజమౌళి, అంబటి లక్ష్మణ్ పాల్గొన్నారు.

దస్నాపూర్‌లో పంటల పరిశీలన



నవతెలంగాణ-వేమనపల్లి

మండల పరిధిలోని దస్నాపూర్ గ్రామంలో శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి జి. కల్పన, మండల వ్యవసాయ శాఖ అధికారి వీరన్న ఆధ్వర్యంలో పంట పొలాల్లోని వరి, పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి పంటలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు గుర్తించారు. యూరియా వేయడం తాత్కాలికంగా ఆపివేయాలని పొటాష్ ఎకరానికి 25-30 కిలోల వేసుకొని తెగులు వ్యాప్తిని అరికట్టాలని సూచించారు. ప్లాంట మై సిన్ కసుగమైసిన్, 0.2 గ్రాములు లీటర్ నీటికి అగ్రిమైసిన్ 0.4 గ్రాములు లీటర్ నీటికి పిచికారి చేయాలని అన్నారు. పత్తిలో రసం పీల్చే పురుగుల నివారణకు ప్లోనికమిడ్0.3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని, అధిక తేమ, బెట్ట పరిస్థితుల్లో పూత పిందె రావడం గమనిస్తే 5 లీటర్ల నీటికి 1 ఎంఎల్ ప్లనోఫిక్స్ కలిపి 10-15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలని సూచించారు. అదేవిదంగా ఆన్ లైన్‌లో పంట వివరాల నమోదు వివరాలను పరిశీలించారు. ముఖ్యంగా రైతులందరు రైతు వేదికలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వరి పంటలను పరిశీలించి రైతులకు తగు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రొక్సర్ సుల్తానా, హెప్సీబా, రైతులు సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

చిలుకలయ్య ఆలయం ప్రారంభం

నవతెలంగాణ-జన్నారం



గ్రామాల అభివృద్ధికి సంస్కృతి సంప్రదాయాలు గొప్ప విజయాలను అందిస్తాయని, తెలంగాణ నేతకాని మహార్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్సిటీ చైర్మన్ సాయిని ప్రసాద్ నేత అన్నారు. శుక్రవారం మండలంలోని కవ్వాల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన చిలుకలయ్య ఆలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిలుకలయ్య దేవుని ఆశీస్సులు ప్రతి ఒకరిపై ఉండాలని ఆ భగవంతుని కోరుతున్నామన్నారు. ముందుగా స్వామివారిని దర్శించుకొని, అక్కడ ఏర్పాటుచేసిన శిలఫలకన్ని ఆవిష్కరించారు. సహజంగా గ్రామాల్లో ప్రజలు ప్రకృతి ఆరాధికులుగా వారి విజయంలో దైవానుగ్రహం ఉంటుందని బలంగా నమ్ముతారని, దానిలో భాగంగా పాడిపంటల అభివృద్ధిలో చిలకలయ్య అనుగ్రహం ఉంటుందని భావించి నేడు ఇంత గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించిన ఆలయకమిటీ సభ్యులను ప్రసాద్ నేత అభినందిచారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు వంగ శ్రీనివాస్, తుడుం హనుమాన్లు, తుడుం శివకృష్ణ, గాజర్ల మల్లేష్, జాడి కుమార్, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజి అధ్యక్షుడు మమ్మద్ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

పత్తి పంటను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో వ్యవసాయ అధికారులు రాజనరెందర్, ఎస్ ప్రేమ్‌కుమార్ శుక్రవారం పత్తి పంటలను పరిశీలించారు. ప్రస్తుతం పత్తిలో ఆశించే చీడపీడల గురించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ప్రస్తుతం పత్తిలో ఆశించే దోమపోటు పొగాకు లద్దే పురుగు నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. రేచిని గ్రామములలోని ఎరువులు పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఫెర్టిలైజర్ యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువులు విక్రయించాలని రైతులకు తప్పకుండా రసీదులు ఇవ్వాలని సూచించారు. ఈ కాంరుక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు శంకర్, ధనలక్ష్మి పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-లోకేశ్వరం



సీజనల్ వ్యాధుల దృష్ట్యా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ వెంకట రమేష్ కోరారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని హావర్గా గ్రామంలో ఆయన పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. పాత కుండలు, టైర్లలో నిల్వ ఉన్న నీటిని సిబ్బందితో పారబోయించారు. ఇంటి పరిసరాల్లో మురుగు గుంతలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

లింగి వృద్ధాశ్రమంలో అన్నదానం

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని లింగి వృద్ధాశ్రమంలో శుక్రవారం తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన వీర జవాన్ దాసరి నవీన్ 30వ జయంతి సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ముందుగా పొన్నారిలో తల్లిదండ్రులు దాసరి సువర్ణ, స్వామి నవీన్ విగ్రహానికి పూల మాలలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నవీన్ అన్న ప్రవీణ్ మాట్లాడుతూ పుట్టినరోజులకు డబ్బులు వృథా చేయకుండా వృద్ధులకు తోచిన సహాయాన్ని అందజేసి వారికి అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు వీర జవాన్ నవీన్ స్నేహితులు ప్రశాంత్, నారాయణ, గణేష్, నరేష్, విష్ణు, తిరుపతి, సాయి ప్రశాంత్, సాయి పవన్ పాల్గొన్నారు.

రూ.1000 కోట్ల కుంభకోణంపై సీబీపై విచారణ జరిపించాలి



నవతెలంగాణ-నస్పూర్

కార్మికులకు చెందిన సిఎంపీఫ్ సంస్థలో రూ.1000కోట్ల కుంబకోణం జరిగిందని, దీనిపై సిబిఐ విచారణ జరిపించాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్(బిఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియా ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బొగ్గు గని కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం యూనియన్ కృషి చేస్తుందని, ప్రతి డిమాండ్‌ను సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాగం రాజేందర్, ఐలవేణి శ్రీనివాస్, భూంపెల్లి రమేష్, గోనె రామకృష్ణ, కాంపల్లి తిరుపతి, గోళ్ల మహేందర్, కుంట రాజు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న కార్మికునికి సన్మానం

నవతెలంగాణ-జైపూర్

శ్రీరాంపూర్ ఏరియాలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న కార్మికుడు రత్నాకర్‌రెడ్డిని సహచర కార్మికులు ఘనంగా సన్మానించారు. శ్రీరాంపూర్ ఏరియా నుండి రామగుండం ఏరియా-2కు బదిలీపై వెళ్తున్న ఆయనను శుక్రవారం గని ఆవరణలో సహచర కార్మికులు శాలువాలతో సన్మానించారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకునిగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని రత్నాకర్‌రెడ్డి సేవలను కొనియాడారు.

లంబాడితండా(కె)లో కొనసాగుతున్న సర్వే



నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని లంబాడితండా(కె) గ్రామ పంచాయతీలో బేస్ ఫ్యామిలీ డేటా సర్వే కొనసాగుతోంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన లంబాడితండా(కె)లో సర్వేను ఆర్డీవో హరికృష్ణ పరిశీలించారు. 179 ఇండ్లను పూర్తి చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీవో షేక్ సఫ్దర్ అలీ, సీనియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు విద్యాసాగర్, నరేశ్, కీర్తి పాల్గొన్నారు.

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటరు నమోదు ప్రారంభం

నవతెలంగాణ-తాంసి

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం తహసీల్దార్ కార్యాలయాల్లో శుక్రవారం నుండి ప్రారంభమైందని తాంసి, భీంపూర్ తహసీల్దార్లు లక్ష్మి, నలందప్రియ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయ మండలి ఎన్నికలకు ఓటర్ నమోదుకు తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 4 నుండి 31 వరకు కొనసాగుతుందన్నారు. ఓటరుగా నమోదు చేసుకోవడానికి పట్టభద్రులు ఫారం నంబర్ 18, ఉపాధ్యాయులు ఫారం నెంబర్ 19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పంచాయతీ ప్రత్యేకాధికారిగా బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-జైపూర్

కుందారం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా ఆర్‌డబ్ల్యుఎస్ డిప్యూటీ డీఈ విద్యాసాగర్ బాధ్యతలు స్వీకరించారు. విద్యాసాగర్‌ను గ్రామ పంచాయతీ మాజీ సర్పంచులు సమ్మయ్య, నర్సింగరావు శాలువాలతో ఘనంగా సన్మానించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ పరంగా కృషి చేయాలని కోరారు.

వేతనాలు పెంపుతో ఏఐటీయూసీ సంబరాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సివిల్ సప్లయి కార్మికులకు వేతనాలు పెంచడంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించేలా సివిల్ సప్లయి కమిషనర్ హామీ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ తెలిపారు. వేతనాలు పెంచడాన్ని స్వాగతిస్తు శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్‌లో సంబరాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ చర్చలో నాయకులు పెట్టిన డిమాండ్లను కమిషనర్ అంగికరించారన్నారు. గతంలో ఎగుమతి, దిగుమతికి రూ.20 ఇచ్చే వారని ప్రస్తుతం దాన్ని 29కు పెంచారని, బోనస్ 6500 నుంచి 7500కు పెంచడంతో పాటు సంవత్సరానికి రెండు జతల యూనిఫాం, కుట్టు కూలీ గతంలో 1300 ఉండగా ప్రస్తుతం రూ.1600 ఇచ్చేందుకు సుముఖత చూపారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, సివిల్ సప్లయి హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్కే అఫ్రోజ్, జిల్లా నాయకులు ఊశన్న, లక్ష్మీపతి, సలీం, జమ్ము విశాల్, గంగన్న పాల్గొన్నారు.

డిజిటల్ కార్డు సర్వే పకడ్బందీగా చేపట్టాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ పైలట్ ప్రాజెక్టు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం పట్టణంలోని వార్డు నంబర్ 11, 12లో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. సర్వే నిర్వహిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారి వివరాలను పక్కగా నమోదు చేయాలన్నారు. అక్కడ కార్డు ఉండి ఇక్కడ కూడా డిజిటల్ కార్డు కావాలంటే ఆ వివరాలు కూడా స్పష్టంగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయడంతో పాటు ఫొటోలు తీయాలన్నారు. రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ, రైతుబీమా, రైతు భరోసా, షాది ముబారక్, కల్యాణ లక్ష్మి ఆసరా పింఛన్ వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి వివరాలు 30 శాఖలు 30 రకాలుగా సమాచారాన్ని సేకరించడం వల్ల సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. అర్హులందరూ ఒకే కార్డు ద్వారా సేవలు పొందడానికి వీలు ఉంటుందన్నారు. ఈ నెల 7 వరకు ఈ సర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, మావల తహసీల్దార్లు శ్రీనివాస్, వేణు, మున్సిప్ కమిషనర్ ఖమర్ అహ్మద్, వార్డు కౌన్సిలర్ షానవాజ్, వార్డు ఆఫీసర్ కమల, ధనలక్ష్మి, మంజుల, సందీప్, భీంసేన్‌రెడ్డి పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి



నవతెలంగాణ-నస్పూర్

ప్రయివేట్ నర్సింగ్ హోమ్‌లు నడిపే గైనకాలజిస్టులు సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్యాధికారి హరీష్‌రాజ్ అన్నారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాలోని ప్రైవేట్ నర్సింగ్ హోమ్ గైనకాలజిస్టులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి ఆసుపత్రి వైద్యులు ఈ నెలలో సాధారణ ప్రసవాలు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. వంద శాతం సిసెక్షన్ చేసిన ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటామని, సాధారణ ప్రసవాలు మొదటి కాన్పులకు చేయడంలో వైద్యులు ముందుకు రావాలని ఆదేశించారు. ఎలాంటి సమస్యలున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కృపాబాయి, అనిత, సుధాకర్ నాయక్, అనిల్, అరుణశ్రీ పాల్గొన్నారు.

డ్రైవర్లు ఏకాగ్రతతో విధులు నిర్వర్తించాలి



- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

నవతెలంగాణ-తాండూర్

డ్రైవర్లు ఏకాగ్రతతో విధులు నిర్వర్తించి గమ్యస్థానాలకు చేరుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. బెల్లంపల్లి హెడ్ క్వార్టర్స్‌లో జిల్లాలో పోలీస్ అధికారుల వద్ద డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సక్రమంగా విధులు నిర్వహించిన డ్రైవర్లకు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్లక్ష్యపు డ్రైవింగ్ కుటుంబ భవిష్యత్తును రోడ్డు పాలు చేస్తుందని తెలిపారు. డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది ఆరోగ్యంపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలన్నారు. వాకింగ్, యోగా, ధ్యానం వంటి మనసుకు ప్రశాంతత నిచ్చే అలవాట్లను అలవర్చుకోవాలని తెలిపారు. చెడు అలవాట్లకు, వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. తీరిక సమయాల్లో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని సూచించారు. సరైన విశ్రాంతి తీసుకుంటూ కంటి చూపును మెరుగుపరిచే ఆహారం తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, బెల్లంపల్లి వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య, ఆర్‌ఐ ఎంటిఓ సంపత్, ఆర్‌ఐ వామనమూర్తి, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆత్మరక్షణ పద్ధతులలో సుశిక్షితులు అయిన స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు డీఈఓ ప్రణీత, సెక్టోరల్ అధికారి ఉదయశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 163 ప్రాథమిక, ఉన్నత పాఠశాలలలో బాలికల ఆత్మ రక్షణ సాధనకై రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ పరియోజన పేరిట, సమగ్ర శిక్ష ఆత్మరక్షణ శిక్షణ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 17 నుంచి ఫిబ్రవరి 17తేది వరకు దశలవారీగా నిర్వహించు ఈ కార్యక్రమం కొరకు శిక్షకులను జిల్లా డీఈఓ కమిటీ ద్వారా ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. అక్టోబర్ 8న ఎంపికకు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని సూచించారు.

నేడు సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని ఆయా గ్రామాలో ఉన్న రైతులు తాము పండించిన సోయా విత్తనాలను ప్రభుత్వం ద్వారా శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోయా కొనుగోళ్ల కేంద్రాన్ని ప్రారంభిస్తామని వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ రేకుల గంగా చరణ్, కార్యదర్శి క్రాంతి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో సోయా కొనుగోళ్ల కేంద్రాన్ని ప్రాంభించేందుకు ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ హాజరువుతునట్టు చైర్మెన్ తెలిపారు. దీంతో మండలంలో ఉన్న రైతులు ప్రభుత్వం ద్వారా మద్దతు ధర రూ.4,892 కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఏజెన్సీ కోటా ప్రకటించాకే నియామకాలు చేపట్టాలి

- కలెక్టరేట్ ఎదుట అభ్యర్థుల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏజెన్సీ కోటా ప్రకటించిన తరువాతనే డీఎస్సీలో నియమకాలు చేపట్టాలని కోర్టు తీర్పు ఉన్నదాన్ని ఈ ప్రభుత్వం లెక్క చేయకుండా నియామకాలు, సర్టిఫికెట్ల వేరిఫికేషన్ చేపట్టడం ఎంతవరకు సమంజసమని ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమేష్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏజెన్సీలో 5వ షెడ్యూల్, పెసా, 1/70 చట్టాలున్నా గిరిజనేతరులకు పోస్టింగులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఏజెన్సీలో నియమకాలను నిలిపివేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమేష్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లికి వచ్చిన సందర్భంగా ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుంటామని చెప్పారన్నారు. కానీ ఏజెన్సీ ప్రాంతంలోని యువత ఉద్యోగాలు లేక రోడ్లపై తిరుగుతున్నారన్నారు. గత ప్రభుత్వాలు ఐటీడీఏలో బ్యాక్‌లాగ్ పోస్టులున్నా భర్తీ చేయలేదన్నారు. ఈ ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందని అనుకున్నామని, పది నెలలు గడస్తున్నా ఎలాంటి చర్యలు లేవన్నారు. కోర్టు తీర్పుకు అనుగుణంగా ఏజెన్సీ కోటాను ప్రకటించిన తరువాతే నియమకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ మెస్రం రవి, తిరుపతి, కోనేరావ్, మెస్రం సురేష్, లావణ్య ఉన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు గడువు పొడిగింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి జిల్లాలో ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులలో అడ్మిషన్ల కోసం గడువు పొడగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారిణి ప్రణీత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 3తో గడువు ముగియగా ఈనెల 31 వరకు పొడగించినట్టు పేర్కొన్నారు. అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్లు, మండల విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయ సిబ్బంది ఈ విషయాన్ని విస్తృత ప్రచారం చేయాలని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో అడ్మిషన్ పొందుటకు గాను తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎసెస్సీ, ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందేవారు వెబ్ సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణఓపెన్‌స్కూల్.ఓఆర్జీ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫీజు చెల్లించి అధ్యయన కేంద్రంలో ధ్రువపత్రాలు సమర్పించాలని సూచించారు.

నేడు గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలు

నవతెలంగాణ-జైపూర్

పెద్దపల్లి మాజీ ఎంపీ గడ్డం వెంకటస్వామి 95వ జయంతి వేడుకలు శనివారం ప్రభుత్వ పరంగా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ, ఎంపీఓ సత్యనారాయణ, శ్రీపతి బాపురావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్న వెంకటస్వామి జయంతి వేడుకలకు మండల పరిధి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రేవంత్‌రెడ్డి మాదిగల ద్రోహి : ఆరెల్లి మల్లేష్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరించిన సీఎం రేవంత్ రెడ్డి మాదిగల ద్రోహి అని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరెల్లి మల్లేష్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను రాష్ట్రాలకు అధికారాన్ని కల్పిస్తూ సుప్రీంకోర్టు ఆగస్టు 1న తీర్పు ఇచ్చి నేటికీ రెండు నెలలు గడిచిందన్నారు. ఈనెల 9న జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నల్ల జెండాలతో నిరసన ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 15న ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యవర్గ సమావేశాలు హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో భవిష్యత్తు కార్యచరణ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ప్రకటించడం జరుగుతుందని పేర్కొన్నారు. మాదిగ ఉప కులాల ప్రజలు యువత జాతి భవిష్యత్తు కోసం జరిగే పోరాటం కోసం జరగబోయే ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు కంబ్లె బాలాజీ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బారుకుంట సుభాష్, ఇండ్ల ఎల్లన్న, అరేపల్లి గణేష్, సందురి వినయ్ సాగర్, జిల్లా నాయకులు దాసరి రాంప్రసాద్, రాజేశ్వర్, అల్లకొండ రవి, సంజీవ్, ప్రణయ, పోశెట్టి, విలాస్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమిపూజ

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కుంటాల గ్రామంలో జగదాంబదేవి, సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి రూ.43లక్షలతో చేపట్టే పనులకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహరాజ్‌కు బంజారా సాంప్రదాయ పూజలు చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఐఈఓ రవీందర్ పాల్గొని బతుకమ్మకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మండల కేంద్రం నుంచి ఎంసెట్ కోచింగ్ కొరకు విద్యార్థులను పంపించడం జరుగుతుందని, దీనిని విద్యార్థులు ఉపయోగించుకొని తమ భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని కోరారు. బతుకమ్మ సెలువులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో విద్యార్థులందరు కలిసి బతుకమ్మ సంబురాలను ఘనంగా జరపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భగవాండ్లు, పూర్వ ప్రిన్సిపాల్ సూర్య ప్రకాష్, విద్యార్థులతో కలిసి బతుకమ్మ పాటల పైన స్టెప్పులు వేశారు. ఈ సందర్భంగా డిఐఈఓ రవీందర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి తీరొక్క పువ్వులతో బతుకమ్మ సిద్ధం చేయడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా సృష్టిలో ఎక్కడైనా పూలతో దైవాన్ని పూజిస్తామని కానీ పూలనే దైవంగా భావించి గోపురంలా పేర్చి ఆరాధించడమే ఈ బతుకమ్మ ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఇది కూడా సైన్స్‌లో భాగమేనని పూలను నీళ్లలో వేయడం ద్వారా నీటి శుద్ధి అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు భగువాండ్లు, గణేష్, సూర్యప్రకాష్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కోనేరు సుందరీకరణకు చర్యలు

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలో ముక్తాదేవి ఆలయం ఎదురుగా ఉన్న కోనేరును స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా సుందరీకరణ చేయనున్నట్లు డిఆర్డిఓ విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆలయం ఎదురుగా ఉన్న కోనేరును పరిశీలించి పలు వివరాలను వీడీసీ సభ్యులు, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం వారితో చర్చించారు. మరమ్మత్తులు చేయించినట్లయితే భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. దీంతో నీటి మట్టం భూమిలో పెరగడం వల్ల రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కలెక్టర్‌కు నివేదించి ఆదేశాల మేరకు ముందుకు పోతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివకుమార్, ఏపీఓ శిరీషారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, మాజీ సర్పంచ్ వెంకటపూర్ రాజేందర్, మున్నూరు కాపు సంఘం తాలూకా అధ్యక్షులు రోళ్ల రమేష్, విడిసి అధ్యక్షుడు నారాయణ, నాయకులు ధర్మపురి సుదర్శన్, తాటివార్ రమేష్, జీవన్, లవన్ పాల్గొన్నారు.



రెండోరోజు అభ్యర్థులకు భోజనం ఏర్పాటు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని డైట్ కళాశాలలో జరుగుతున్న డీఎస్సీ సర్టిఫికెట్ వేరిఫికేషన్ కోసం సుదూర ప్రాంతాల నుంచి అభ్యర్థులు వేరిఫికేషన్ కోసం హాజరవుతున్నారు. అయితే అభ్యర్థుల సౌకర్యార్థం కోసం పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం రెండో రోజు సైతం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దీనికి డీఈఓ ప్రణీత హాజరై ప్రారంభించారు. అభ్యర్థుల కోసం పీఆర్టీయూ టీఎస్ భోజన సౌకర్యం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొమ్ము కృష్ణ, స్వామి, నాయకులు పాల్గొన్నారు.

దుర్గామాత వద్ద ఘనంగా గాజుల పూజ

నవతెలంగాణ-నిర్మల్

ఎన్టీఆర్ మార్గ్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ దుర్గామాత వద్ద రెండో రోజు శుక్రవారం మహిళలు, పిల్లలు, భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో శ్రీ గాయత్రి అమ్మవారికి గాజుల పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి పలు రకాల నైవేద్యాలు, ఫలాలు, పువ్వులతో పూజించారు. అనంతరం ప్రజలందరూ సుఖసంతోషాలతో సౌభాగ్యాలతో ఉండాలని అమ్మవారికి సామూహిక గాజుల పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి అష్టోత్తరాలతో, 108 గాజులతో గాజుల పూజా నిర్వహించి, అమ్మవారిని గాజులతో అలంకరించారు. కార్యక్రమంలో కాలనీ మహిళలు శివురాం సురేఖ, కందుల భారతి, దేశెట్టి లక్ష్మీ, తోడిశెట్టి శారద, పసుపుల సరిత, భారె లక్ష్మి, లింగంపల్లి నివేదిత, బచ్చువార్ దివ్య, చిటిమల సునీత, గాదె స్వప్న, నాచం ప్రసన్న లక్ష్మీ, చిన్న మాధవుని జ్యోతి, కాలనీవాసులు పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.